# బండారం బయటపడింది:

• వోగేటి శివరామకృష్ణ •

ఇది అయిదు సంవత్సరాల నాటి సంగతి. హటాత్తుగా అప్పుడు వ్రాసిన డైరీ యేదో పనిమీద తీస్తే బయల్పడింది, వృత్తాంతం నా కండ్లకు గోచరించింది. ఆ దినం—

ఇంకా నిద్రపరుపునుంచి లేవనేలేదు. చిరు చీకటి యుండగానే అమ్మా నాన్నా లేచారు. నే పడుకొన్న గదిలోకి నాన్న రెండు మూడు మార్లు తొంగిచూశాడు—కాని నే చూడనట్లు, కళ్ళు మూసుకునే పడున్నా.

పక్క గదిలోంచి 'వాడింకా లేవలేదేం... తొందరగా లేచి, చెరువుకెళ్ళి నీళ్ళు తోడుకొని రమ్మను' అన్న నాన్న మాటలు వినిపించాయి. ఇంక లేవటం తప్పదు. ఈవిధంగా మంచంమీద నుంచి లేవడం జరిగింది.

రోజూకంటె నాయందు గౌరవభావాలంతా చూపించారు. ఇరుగుపొరుగువారు కూడా నా వయిపు చూసి నవ్వారు. కారణం నాకు తెలుసు. వారికీ తెలుసు!

ఎనిమిది గంటలవుతోంది. ఆరోజు శనివారం. స్కూలు సెలవుదినం. అంతకుముందే నాన్న చెప్పిన మాటలను ఆచరణలో పెట్టడానికన్నట్లుగా చక్కటి యిస్త్రీ చొక్కా, లాగు కట్టుకొని, తల పదిమార్లు దువ్వుకొని, యెంతో కాలంనుంచి మూలబడియుంటున్న రెండు కుర్చీలు అటకమీంచి తీయించి, తుడిపి వీధిగుమ్మం కెదురుగా ఉన్న నా గదిలో వేయించుకొని తెలుగుపద్యాలు వల్లెవేయటం ప్రారంభించా. అంతలో మా నాయన చెరువునుంచి స్నానంచేసివచ్చి నన్ను చూశాడు. ఆయన్ని చూచి మరింత బిగ్గరగా చదవసాగా. ఎందుకో చిరునవ్వు, ఆయన ముఖంలో గోచరించింది. అమ్మ కూడా, ఆ సమయానికే వచ్చింది. "ఏమండీ, అప్పుడే ఎనిమిదిన్నరయినట్లుంది... యింకా రాలేదేం?' అని నాన్న నడిగింది.

"ఆ... వస్తున్నారు. ఇంకో గంటలోపు వస్తారు. ఒరేయి, కదలక యిక్కడే వుండు... ఎవరయినా వస్తారు' అని మా నాన్న లోనికి దేవతార్చన చేసుకోడానికి వెళ్ళాడు. అమ్మ వంటపని మీద వెళ్ళిపోయింది. నా గుండెదడంతోటే, నా నోటికి మూతబడింది. ఏవేవో ఆలోచనలు నా బుఱ్ఱను వేడిచేయసాగాయి. 'అబ్బ యింకా ఒక గంట... యేలాగ బాబూ' అని పుస్తకం రెండో కుర్చీలో ఉంచి పచార్లుచేయసాగా.

హటాత్తుగా నా కళ్ళు, కళ్ళజోడుతోనున్న ఆ నల్లటి విగ్రహాన్ని ఆకర్షించాయి. తొందరగా కుర్చీలోకి వచ్చి, కూర్చుని, పుస్తకం చూస్తున్నట్లు నటించసాగాను. ఏదో చదివేస్తున్నట్లుగా పూర్వం కంఠస్థం చేసిన 'శ్రీజగన్మాతా' అన్న పద్యం నోటితో అనేస్తున్నా, కళ్ళు... ఆ వచ్చే ఆయన వయిపు, పరుండగానే చూస్తూనే వున్నాయి.

ఆ నల్లటాయన నా గదిముందరగా వచ్చాడు. 'శంకరశాస్త్రిగారున్నారా ఇంట్లో' ప్రశ్నించాడాయన.

'లోపల దేవతార్చన చేసుకొంటున్నారు వస్తారు కూర్చోండి' అని గౌరవం చూపి, నా దగ్గరగా ఉన్న కుర్చీ చూపా. తిరిగి యధాప్రకారంగా 'శ్రీజగన్మాతా' అన్న పద్యాన్ని (దానిలో మాధుర్యం తెలిసినట్లుగా) పుస్తకం చూస్తున్నట్లు నటిస్తూ, అనసాగా.

ఆయన కాసేపేదో ఆలోచించాడు. నా పద్యం చదవటం కూడా పూర్తయింది.

'ఏం చదువుకొంటున్నావు బాబూ?' అని అడిగాడాయన. నా గౌరవానికి లోటు రానీయడం యిష్టంలేక 'ఐదో ఫారం' అని జవాబిచ్చా.

'అయితే... మీకు తెలుగు తెలుసా?'

'అవును... మా తెలుగు తెలిసిందే' అన్నా మరింత బిగ్గరగా.

'ఏదీ... ఓమారిలాయివ్వు' అని ఆయన పుస్తకం నా చేతులో ఉన్నది ఉన్నట్లుగా తీసుకొన్నాడు. (పుస్తకం తలక్రిందులుగా, పట్టుకొన్నానని




సంగతి, ఆయన చేతులోని కళ్ళజోడు తీసిన తర్వాత తెలిసింది) పుస్తకం తెరచి తల్లక్రిందులుగా ఉండటం మూలాన తెల్లబోయి, నాకేసి చూశాడు. నే తలవంచుకొన్నా. మెల్లిగా కొన్ని పుటలు తిరగేసి (నా త్రిజగన్మోహన కోసం కలిగిన చేసిన పాపం) కవరు పేజీలోనున్న నా పేరూ, వాల్లవ ఫారం అన్న 'పెద్దమ్మగారూ...' అనే సంవత్సరం అన్న విషయాలన్నీ చూశాడు. నా బండారం బయటపడింది. చేసేదిలేక... వెలితెలబోయి తల వంచుకొని కూర్చున్నా. వెధవ కోడిక, ఎవ్వరయినా సరే యిలా ముందుగా పరీక్ష చేస్తారని తెలిస్తే మేలుగా పుస్తకాలను సవరించుకొనే దానిని!

ఒక ఆలోచన స్ఫురించింది. నా తెలివితేటలను చూపి, యిప్పటికి నామీదనున్న దురభిప్రాయాలన్నీ పోగొట్టుకోవాలన్న తలంపు నాకు కలిగింది.

'అయ్యా! మీరు నే పనిమీద వచ్చారని' వెనకా ముందూ ఆలోచించకుండా నమ్రతతో ప్రశ్నించా.

ఆయన యేమనుకొన్నాడో గానీ 'శంకర శాస్త్రిగారిని చెప్పమన్నారు. పిల్లవాడు బుద్ధిమంతుడయితే... సంబంధం కుదిరితే... మా అమ్మాయినిచ్చి పెళ్ళిచేద్దామని...' అన్నాడు.

నా నోట్లోంచి గొణుగుతూ యీ మాటలు వెలువడ్డాయి. ముందూ వెనకా ఆలోచించకుండా యిలా అనేసా: "ఓహో! అయితే నేనే ఆ శంకరశాస్త్రిగారి ప్రథమ పుత్రుణ్ణి"

పాపం ఆయన యేమనుకొన్నాడో తెల్లబోయాడు. ఒకటి రెండు నిముషాలు నిశ్శబ్దంగా కూర్చొని, యేదో 'అర్జంటు పని ఉందని' తిరిగి మా నాన్నని ఆ సాయంకాలంలోపున కలుసుకొంటానని చెప్పి వెళ్ళిపోయాడు.

మా నాన్న వచ్చి అడిగాడు. తిరిగి కలుసుకొంటారన్న సంగతి చెప్పినప్పటినుంచీ, ఆయన కోసం యెదురుచూశాడు. చీకటిపడింది గాని... ఆయన రాలేదు. కారణం యేమయియుంటుందో.

అంతా చదవటం అయిపోయింది. పక్కనుండి యెవరో ఫక్కున నవ్వుతున్నారు. వెనక్కి తిరిగి చూసే మా సుశీల. అంతా చదివింది కాబోలు నవ్వుతూ అంది: "అబ్బ... చాలా గ్రంథం జరిగిందే పెళ్ళిచూపుల్లో". నా పెళ్ళిచూపుల పెద్దరికం యిలా బయటపడింది.